ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
తమిళనాడు
TAMILNADU
బుధవారం 14 ఫిబ్రవరి 2024

ఆకాశాన్నంటుతున్న రోజాలు


కోయంబేడు మార్కెట్లో రోజా పూలు

ప్యారీస్, ఫిబ్రవరి 13: ప్రపంచవ్యాప్తంగా బుధవారం ప్రేమికుల దినోత్సవం జరుపుకోనున్న నేపథ్యంలో రోజా పూలకు గిరాకీ ఏర్పడింది. ప్రేమికులు తమ మనసు విప్పి చెప్పే సమయంలో ఎదుటివారి హృదయాన్ని హత్తుకొనేలా రోజా పూలు, అందంగా డిజైన్ చేసిన గ్రీటింగ్ కార్డులు ఇస్తుంటారు. ప్రస్తుతం అనేక సామాజిక మాధ్యమాలు వచ్చినప్పటికీ, వాలంటైన్ డేకు మాత్రం ఏమాత్రం ప్రాధాన్యం తగ్గలేదు. ఈ నేపథ్యంలో, ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు రాష్ట్రం ముస్తాబైంది. ఈ నేపథ్యంలో, కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్‌కు నీలగిరి, కృష్ణగిరి జిల్లాలు, కర్ణాటక తదితర పొరుగు రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకున్న వివిధ రకాల రోజా పూల విక్రయాలు మంగళవారం నుంచే ఊపందుకున్నాయి. ఇక్కడ రెడ్ రోజ్, కలర్ రోజ్, తాజ్‌మహల్ రకం, రాక్‌స్టార్ ఆరెంజ్ రోజ్ అని సుమారు 350కి పైగా ఆకర్షణీయమైన రంగుల్లో గులాబీలు విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రేమికులు పోటీపడుతున్నారు. సాధారణ రోజుల్లో 5 నుంచి 7 టన్నుల రోజాలు మాత్రమే ఈ మార్కెట్‌కు దిగుమతి అవుతుండగా, ప్రేమికుల దినోత్సవం సందర్భంగా సుమారు 17 టన్నుల పూలు దిగుమతి అయ్యాయి. సాధారణ రోజుల్లో 10 రోజాల పుష్పగుచ్ఛం రూ.250కు విక్రయిస్తుండగా ప్రస్తుతం రూ.300లకు పెరిగింది. కాగా, ప్రేమికుల మనస్సును ఆకట్టుకొనేలా దిగుమతి చేసుకున్న రోజాలను కొనుగోలు చేసేందుకు శివారు ప్రాంతాల వ్యాపారులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మరోవైపు షాపింగ్‌మాల్స్‌లో ప్రేమ జంటలను ఆహ్వానించి ప్రత్యేక కార్యక్రమాలు, విందులు ఏర్పాటుచేసే పనులు ముమ్మరంగా సాగాయి. బుక్‌షాపులలో వివిధ డిజైన్‌లతో రూపొందించిన వాలంటైన్ డే గ్రీటింగ్ కార్డుల విక్రయాలు కూడా జోరందుకున్నాయని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు.

మెరీనాలో ఆంక్షలు!

ప్లీజ్ ఇటువైపు రావొద్దు

ప్రేమ జంటలకు పోలీసుల సూచన



అడయార్, ఫిబ్రవరి 13: తమ హృదయం గెలుచుకున్న నెచ్చెలికి మనసు విప్పి చెప్పేందుకు మెరీనాకంటే మెరుగైన ప్రాంతం మరొకటి లేదని చాలామంది భావిస్తుంటారు. అందుకే 'ప్రేమికుల దినోత్సవం' వచ్చిందంటే చాలు పోలోమంటూ అటువైపు పరుగులు పెడుతుంటారు. దాంతో బుధవారం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా అక్కడకు రావాలనుకుంటున్న జంటలకు పోలీసులు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. అలాంటి ప్రేమ జంటలు మెరీనా వద్దకు వస్తే సమస్యలు ఎదురయ్యే అవకాశముందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా బీచ్, పార్కుల్లో కనిపించే ప్రేమ జంటల చేత కొన్ని హిందూ సంస్థలు బలవంతంగా తాళి కట్టిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పలుచోట్ల ఘర్షణలు జరుగుతుండగా, ఈ అవమానాన్ని భరించలేక కొన్ని జంటలు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలూ ఎదురవుతున్నాయి. దీంతో ఇలాంటి ఘటనలు ఎదురుకాకుండా పోలీసులు ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ప్రేమికుల మెరీనా బీచ్‌వైపు రావద్దని హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో ప్రేమ జంటలను బెదిరించడం, వారిపట్ల దురుసుగా ప్రవర్తించడం వంటి దుశ్చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. అంతేగాక మెరీనా బీచ్, పార్కుల్లో బుధవారం పహారాను పెంచారు. బీచ్ తీరంలో నిఘా కోసం మహిళా పోలీసులను అధిక సంఖ్యలో నియమించారు. మరోవైపు ప్రేమికుల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకునేందుకు పలు ప్రేమజంటలు సిద్ధమయ్యాయి.


సీఎం స్టాలిన్, ఈపీఎస్

ఈపీఎస్ వినతిని పరిశీలించండి

- ప్రతిపక్ష ఉపనేత సీటు వ్యవహారంలో స్పీకర్‌కు సీఎం విజ్ఞప్తి
- 11 మంది దివంగత నేతలకు అసెంబ్లీ సంతాపం

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనేత సీటును ఖరారు చేయాలంటూ సుదీర్ఘకాలంగా కోరుతున్న అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామికి అనూహ్య మద్దతు లభించింది. ఆయన వినతిని పరిశీలించాలని స్పీకర్ అప్పావుకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ విజ్ఞప్తి చేశారు. దీంతో శాసనసభలో ఒక్కసారిగా సభ్యులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. అన్నాడీఎంకే నుంచి మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంను బహిష్కరించిన తరువాత శాసనసభలో ప్రతిపక్షనేతగా ఈపీఎస్, ఉపనేతగా ఆర్‌పీ ఉదయకుమార్ వ్యవహరిస్తారని అన్నాడీఎంకే సర్వసభ్య సమావేశం తీర్మానించిన విషం తెలిసిందే. దీనికి సంబంధించిన లేఖను స్పీకర్ అప్పావుకు అన్నాడీఎంకే అందించింది. అయితే 2021 నుంచి ప్రతిపక్ష ఉపనేత సీటు వ్యవహారంపై స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం శాసనసభలో ఈపీఎస్ మాట్లాడుతూ.. శాసనసభ ప్రతిపక్ష ఉపనేత సీటుకు సంబంధించి తాము ఇప్పటి వరకూ నాలుగుమార్లు స్పీకర్‌కు లేఖలు అందించామని, అంతేగాక నేరుగా సంప్రదించి విజ్ఞప్తి చేశామన్నారు. అయినా ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. పదేపదే శాసన సభ గౌరవమర్యాదల గురించి ప్రస్తావిస్తున్న స్పీకర్.. సభలోని అన్ని పార్టీలను సమానంగా చూడాలని విజ్ఞప్తి చేశారు. పక్షపాత ధోరణితో ఉండకూడదన్నారు. తమ వినతిపై ఎన్నేళ్లకు చర్యలు తీసుకుంటారని ప్రశ్నించారు. ఈ సందర్భగా సీఎం జోక్యం చేసుకుంటూ.. ప్రతిపక్ష ఉపనేత సీటు వ్యవహారానికి సంబంధించి ప్రతిపక్ష నేత ఈపీఎస్ నేతృత్వంలోని బృందం ఇప్పటి వరకూ నాలుగుమార్లు లేఖలు అందించిందని గుర్తు చేశారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అప్పటి స్పీకర్ ధనపాల్ ఇచ్చిన రూలింగ్ మేరకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు అప్పావు బదులిస్తూ.. ప్రతిపక్ష నేత కోరికను పరిశీలిస్తామని, త్వరలోనే మంచి నిర్ణయం చెబుతానని హామీ ఇచ్చారు. దీంతో సభలో ఒక్కసారిగా నవ్వులు పూశాయి.

11 మంది నేతలకు సంతాపం

ఇటీవల మృతి చెందిన 11 మంది ప్రముఖులకు శాసనసభ నివాళి అర్పించింది. మంగళవారం స్పీకర్ అప్పావు అధ్యక్షతన అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కాగానే.. ఇటీవల మరణించిన డీఎండీకే అధినేత విజయకాంత్, మాజీ ఎమ్మెల్యేలు వడివేలు, దేవనాయగం, తంగవేల్, దురై రామస్వామి, కేకే సెల్వం, రాజశేఖరన్, రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ వెంకట్రామన్, శంకరనేత్రాలయ ఛైర్మన్ ఎస్ ఎస్ బద్రీనాథ్, మాజీ గవర్నర ఫాతిమాబీవి తదితరులకు సంతాపం తెలుపుతూ అన్ని పార్టీల సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రముఖులు చేసిన సేవలను సభ ప్రస్తుతించింది.


గవర్నర్ రవి, స్పీకర్ అప్పావు

గవర్నర్‌పై సభా హక్కుల ఉల్లంఘన

స్పీకర్‌కు కాంగ్రెస్ నోటీసు ● పరిశీలిస్తాం: అప్పావు

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): శాసనసభ రికార్డుల నుంచి తొలగించిన అంశాలను సామాజిక మాధ్యమాల ద్వారా బయటకు తీసుకెళ్లిన రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవిపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ సీఎల్పీ లీడర్ సెల్వం పెరుంద్గై స్పీకర్ అప్పావుకు నోటీసులు అందించారు. అనంతరం ఆయన మంగళవారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే మాట్లాడుతూ.. అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగించిన అంశాలను గవర్నర్ తన ఎక్స్ పేజీలో కోడ్ చేశారని తెలిపారు. ఇందువల్ల సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. ఇందుకు స్పీకర్ అప్పావు బదులిస్తూ... కాంగ్రెస్ లేఖ తనకు అందిందని, దాన్ని పరిశీలిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే దానిపై తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అన్నాడీఎంకే నేతృత్వంలో

మెగా కూటమి

మాజీ మంత్రి కడంబూర్ రాజు



అడయార్, ఫిబ్రవరి 13: వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం అన్నాడీఎంకే సారథ్యంలో మెగా కూటమి ఏర్పాటవుతుందని అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కడంబూర్ రాజు చెప్పారు. ఆయన కోవిల్‌పట్టిలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ... గత పదేళ్లుగా కేంద్రంగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ తమిళనాడుకు ఏం చేసిందని ప్రశ్నించారు. ఈ విషయంపై ఒక జాబితాను తయారు చేసి బహిర్గతం చేసే దమ్ము బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు ఉందా అని ప్రశ్నించారు. మదురైలో ఎయిమ్స్ ఆస్పత్రికి శంకుస్థాపన చేసి సంవత్సరాలు గడిచిపోతున్నాయని, ఆ తర్వాత ఒక్క ఇటుక అయినా పేర్చారా అని నిలదీశారు. రాష్ట్ర విద్యార్థులకు నీట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని, కేంద్రం ఆ వెసులుబాటు కల్పించిందా? ఎన్ఎల్‌సీ విస్తరణ కోసం భూసేకరణ విషయంలో కేంద్రం పక్షపాతం వహించి తప్పుకుందన్నారు. ఇలాంటి అంశాలపై అన్నామలై మాట్లాడితే బాగుంటుందన్నారు. ప్రచారం కోసం రాజకీయాలు చేయొద్దనిఅన్నామలైకు హితవుపలికారు. అదేవిధంగాఇంది రాగాంధీ, కరుణానిధి.. కచ్చాదీవిని స్వాధీనం చేసుకున్నారా? అని ప్రశ్నించారు. జాతీయ పార్టీలతో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనంలేదని దివంగత జయలలిత భావించేవారని, ఆ నిర్ణయానికి కట్టుబడి ఎడప్పాడి ముందుకు సాగు తున్నారన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం అన్నాడీఎంకే సారథ్యంలో మెగాకూటమి ఏర్పాటుకానుందని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ నేతృత్వంలోని కూటమి రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలను దక్కించుకుంటుందని కడంబూర్ రాజు జోస్యం చెప్పారు.

డీఎండీకే ఎదురుచూపు

అడయార్: లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల పంపిణీపై చర్చలు జరిపేందుకు అన్నాడీఎంకే పిలుపు కోసం డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం ఆమె కమిటీని కూడా ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన డీఎంకే, అన్నాడీఎంకే, బీజేపీ సారథ్యంలోని కూటముల భాగస్వామ్య పార్టీలు సీట్ల పంపకాలపై చర్చలు జరుపుతున్నాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే చేరేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తోంది. నిజానికి బీజేపీ సారథ్యంలోని కూటమిలో చేరాలన్న ఆలోచనలో ఉన్న ప్రేమలత.. తమ పార్టీకి 14 లోక్‌సభ, రాజ్యసభ సీటును ఇవ్వాలన్న ప్రతిపాదన చేశారు. అయితే, ఆ పార్టీ నేతల నుంచి స్పందన రాలేదు. దీంతో అన్నాడీఎంకేతో కలిసి వెళ్లాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా అన్నాడీఎంకేతో సీట్ల పంపిణీ, ఇతరత్రా విషయాలపై చర్చలు జరిపేందుకు ఆమె సిద్ధమై పిలుపు కోసం ఎదురు చూస్తున్నట్టు ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు.



17, 18 తేదీల్లో

ఢిల్లీకి రాష్ట్ర బీజేపీ నేతలు

అమిత్‌షా, నడ్డాలతో భేటీ ● లోక్‌సభ ఎన్నికలపై తీవ్ర కసరత్తు

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): తమతో ఇతర పార్టీలు కలిసొచ్చినా, రాకున్నా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తమ బలం పెంచుకునేందుకు సన్నాహాలు చేసుకుంటున్న రాష్ట్ర బీజేపీ నేతలకు దిశానిర్దేశం చేసేందుకు ఆ పార్టీ అధిష్ఠానం ఢిల్లీకి ఆహ్వానించింది. దీంతో ఈనెల 17, 18 తేదీల్లో రాష్ట్ర బీజేపీకి చెందిన ముఖ్య నేతలు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు, కీలక నేతలు ఢిల్లీ తరలివెళ్లనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల అనంతరం అన్నాడీఎంకే దూరమవడంతో బీజేపీ ఒంటరిగా మిగిలిపోయింది. ఆ పార్టీతో కలిసి సాగేందుకు టీఎంసీ తప్ప ఇతర పార్టీలేవీ లేకుండాపోయాయి. దీంతో ఈ ఎన్నికల్లో ఒంటరిగా వెళితే బొక్కబోర్లా పడక తప్పదని భావిస్తున్న ఆ పార్టీ.. గతంలో తమకు మిత్రపక్షాలుగా వున్న పీఎంకే, డీఎండీకే వంటి పార్టీలను మళ్లీ దరి చేర్చుకునేందుకు ముమ్మర సన్నాహాలు చేపట్టింది. ఈ వ్యవహారం ఒక డుగు ముందుకు, రెండడుగులు వెనక్కి అన్నట్లుగా సాగుతోంది. బీజేపీ కంటే ముందుగా ఆయా పార్టీలను దరి చేర్చుకునేందుకు రాష్ట్రంలోని ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే తీవ్ర ప్రయత్నాలు చేపట్టింది. దీంతో బలాబలాల రీత్యా అన్నాడీఎంకేతో కలిసి సాగేందుకే పీఎంకే, డీఎండీకే వంటి పార్టీలు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వానికి దిశానిర్దేశం చేసేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఆ పార్టీ అగ్రనేత అమిత్‌షా ఢిల్లీకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో తాము గెలిచేందుకు అనువుగా వున్న నియోజకవర్గాల గుర్తింపు, కూటమిలో చేరే పార్టీలతో మంతనాలు, బూత్‌స్థాయి కమిటీలను బలోపేతం చేయడం, బహిరంగ సభల నిర్వహణ, మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రచారం, ఓటర్లను ఆకర్షించేలా ప్రకటనలు వంటిపై వారు కీలక సూచనలు చేయనున్నారు. అంతేగాక ఎన్నికల్లో వ్యవహరించాల్సిన తీరుపైనా స్పష్టత ఇవ్వనున్నారు. గతంతో మిత్రపక్షంగా వున్న అన్నాడీఎంకేతో మసలుకోవాల్సిన తీరుపైనా వారు పలు సూచనలు చేయనున్నట్టు తెలుస్తోంది. దీంతో ఎన్నికలు, పొత్తులు, సీట్ల ఖరారు వంటి అంశాలపై తమ అభిప్రాయాలను తెలిపేందుకు రాష్ట్ర నాయకగణం సిద్ధమవుతోంది. తమ అభిప్రాయాలను, సూచనలను కుండబద్దలు కొట్టినట్లు తెలియజేయాలని భావిస్తోంది. దీనిపై రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై తన బృందంతో చర్చించినట్లు సమాచారం.



చెన్నైకి విదేశీ విమానాల రాక తగ్గుముఖం

ప్యారీస్, ఫిబ్రవరి 13: చెన్నైలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి విదేశాల నుంచి విమానాల రాక తగ్గిందని విమానాశ్రయ వర్గాలు ఆందోళన వ్యక్తం చేశారు. త్రిశూలం ప్రాంతంలోని జాతీయ, అంతర్జాతీయ విమానాశ్రయాల నుంచి రోజుకు 400కు పైగా విమానాలను నడుపుతున్న నేపథ్యంలో, ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. గత ఏడాది డిసెంబరులో 5.16 లక్షల మంది ఇక్కడి నుంచి విమానాల్లో పయనించారు. ఇది 2022 సంవత్సరం కంటే 12.9 శాతం అధికం. ఈ రెండు విమానాశ్రయాల్లో ప్రయాణికుల వసతులు మెరుగుపరిచారు. రూ.4,000 కోట్లతో విస్తరింపజేశారు. అయినప్పటికీ ఇక్కడ ఏ380 రకానికి చెందిన విమానాలను నడిపేందుకు అవసరమైన వసతులు అందుబాటులో లేవు. ఇదిలా ఉండగా, ఇటీవల ఇక్కడికి రావలసిన విదేశీ విమానాల సంఖ్య బాగా తగ్గిపోయిందని, ఇందుకు కారణం పెద్దరకం విమానాలు, డబుల్ డెక్కర్ విమానాలు పార్కింగ్ చేసి మరమ్మతులు చేపట్టేందుకు వసతులు లేకపోవడమేనని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

ముగిసిన వెట్రి దురైస్వామి అంత్యక్రియలు

భౌతికకాయానికి హీరో అజిత్ దంపతుల నివాళి



సైదై దురైస్వామిని ఓదారుస్తున్న సీఎం (ఇన్‌సెట్లో) వెట్రి దురైస్వామి (ఫైల్‌ఫొటో)

అడయార్, ఫిబ్రవరి 13: చెన్నై నగర మాజీ మేయర్ సైదై దురైస్వామి కుమారుడు, సినీ దర్శకుడు వెట్రి దురైస్వామి (45) అంత్యక్రియలు మంగళవారం ముగిశాయి. ఆయన భౌతికకాయాన్ని అగ్రహీరో అజిత్, ఆయన సతీమణి షాలిని చివరిసారి చూసి నివాళి అర్పించారు. అలాగే, ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు అంజలి ఘటించి కన్నీటి వీడ్కోలు పలికారు. తన స్నేహితుడు గోపినాథ్‌తో కలిసి వెట్రి దురైస్వామి హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విహార యాత్రకు వెళ్లగా ఈ నెల 4న వారు ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు సట్లేజ్ నదిలో పడిపోయింది. ఈ ప్రమాదంలో గోపినాథ్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే, వెట్రి దురైస్వామి ప్రాణాలు కోల్పోయారు. అప్పటి నుంచి ఆయన మృతదేహం కోసం స్థానిక గజ ఈతగాళ్ళు సట్లేజ్ నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఎనిమిది రోజుల తర్వాత ప్రమాదం జరిగిన ప్రాంతానికి ఐదు కిలోమీటర్ల దూరంలో వెట్రి దురైస్వామి మృతదేహాన్ని సోమవారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత భౌతిక కాయాన్ని సిమ్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం పూర్తి చేశారు. అక్కడ నుంచి ఎయిర్ అంబులెన్స్‌లో మంగళవారం మధ్యాహ్నం చెన్నైకి తీసుకొనివచ్చి, స్థానిక టినగర్, సీఐటీ నగర్‌లో ఉన్న వెట్రి దురైస్వామి నివాసంలో చివరి చూపుకోసం ఉంచారు. ఇక్కడకు హీరో అజిత్ తన సతీమణితో కలిసి నివాళి అర్పించారు. వెట్రి దురైస్వామి, హీరో అజిత్ చిన్ననాటి స్నేహితులు. ఆ తర్వాత సాయంత్రం 5 గంటల అనంతరం టి.నగర్ కన్నమ్మపేట శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, వెట్రి దురైస్వామి మృతికి ఎంఎన్‌ఎం అధ్యక్షుడు, సినీ హీరో కమల హాసన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి, మాజీ సీఎం ఓ పన్నీర్‌సెల్వం, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు అన్బుమణి రాందాస్, శశికళ, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు తిరునావుక్కరసు, సినీ నటుడు శరత్ కుమార్ తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని సానుభూతిని వ్యక్తం చేశారు. కాగా సీఎం స్టాలిన్, గవర్నర్ ఆర్.ఎన్. రవి కూడా వెట్రి దురైస్వామి భౌతిక కాయానికి నివాళి అర్పించారు. సైదై దురైస్వామిని ఓదార్చారు.

సమాచార దర్శిని

పిల్లల పెంపకంపై లఘు చిత్రాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: పిల్లల పెంపకంపై ప్రత్యేక లఘుచిత్రాలను ప్రభుత్వం విడుదలచేసింది. పిల్లలు తల్లిదండ్రులతో కుటుంబంగా పెరగాల్సిన ఆవశ్యకత, పెంపకం, పర్యవేక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, యునిసెఫ్, సీఆఫ్ సంస్థలు సంయుక్తంగా విడై, నీలళ్ అనేపేరుతో రెండు లఘుచిత్రాలు రూపొందించాయి.ఈచిత్రాలను మంత్రి గీతాజీవన్ విడుదల చేశారు.

విశ్వకర్మ పథకానికి వయోపరిమితి పెంపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: కేంద్రప్రభుత్వ విశ్వకర్మ పథకానికిసంబంధించిన వయోపరిమితిని18ఏళ్లనుంచి 35ఏళ్లకు పెంచి అమలు చేయడానికి రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. శిల్పులు, వడ్రంగులుసహా 18 పారంపర్య హస్తకళాకారులకోసం ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 2023 సెప్టెంబరులో ప్రారంభించింది. ఈ పథకాన్ని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా వృత్తుల సంస్థల శాఖ అమలు చేస్తోంది. పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి కనిష్ఠ వయోపరిమితి 18 ఏళ్లుగా నిర్ణయించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో లబ్ధిదారులను ఎంపిక చేసి తొలివిడతగా వారం రోజులు ప్రతిరోజు రూ.400 ఉపకార వేతనంతో శిక్షణ ఇస్తారు. అనంతరం రూ.15 వేల కిట్‌ను ఉచితంగా అందిస్తారు. చివరగా రూ.లక్ష వరకు 5 శాతం వడ్డీకి 18 నెలల్లో తీర్చేలా రుణాలు అందజేస్తారు.

జాంజిబార్ ఐఐటీలో బీఎస్-ఎంటెక్ అడ్మిషన్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: ఈస్ట్ ఆఫ్రికా జాంజిబార్ క్యాంపస్‌లో చెన్నై ఐఐటీ ఆధ్వర్యంలో ఏర్పాటైన విద్యాసంస్థలో బీఎస్ యూజీ, ఎంటెక్ పీజీ కోర్సుల్లో డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాలు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సుల్లో వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లకు ఆన్‌లైన్ దరఖాస్తు నమోదు ప్రారంభమైంది. zanzibar.iitm.ac.in అనే వెబ్‌సైట్‌లో బీఎస్ కోర్సుకు ఏప్రిల్ 15వ తేదీ వరకు, ఎంటెక్ కోర్సుకు మార్చి 15వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవాలి. జూన్9 బీఎస్ యూజీకి, మార్చి 31వతేది ఎంటెక్‌కు అర్హత పరీక్ష జరగనుంది. ఉత్తీర్ణులైనవారికి ఇంటర్వ్యూలునిర్వహించి అడ్మిషన్లు ఇస్తారు.

30 రోజుల్లో సమస్యలు పరిష్కరించండి

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: విద్యుత్ వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరించాలని అధికారులకు విద్యుత్ క్రమబద్ధీకరణ కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విద్యుత్ బోర్డు 44 విద్యుత్ పంపిణీ మండలాలుగా పనిచేస్తోంది. ఒక్కో మండలంలో ఒక విద్యుత్ గ్రీవెన్స్ సంఘం ఉంది. ఈ సంఘ అధ్యక్షుడిగా విద్యుత్ బోర్డు ఇంజనీర్ వ్యవహరిస్తారు. వీరి ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించి 50 రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తుంటారు. ఈ నేపథ్యంలో, సమస్యలను 30రోజుల్లో పరిష్కరించాలని గ్రీవెన్స్ సంఘాలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అడ్మిషన్లలో అవకతవకలు జరగకుండా ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పాఠశాల విద్యాశాఖ తెలిపింది. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 38,000 ప్రభుత్వ, 8,000 ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో 45 లక్షలమంది, ఎయిడెడ్‌లో 22లక్షలమంది చదువుతున్నారు.కొన్నిపాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల చేరికను నకిలీగా నమోదు చేస్తున్నట్లు ఫిర్యాదులందాయి. దీనిపై స్పందించిన పాఠశాల విద్యాశాఖ, విద్యార్థుల ఆధార్ నెంబరు, బ్లడ్ గ్రూప్, తల్లిదండ్రుల మొబైల్ ఫోన్ నెంబర్లను ఎమిస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయడంతో పాటు ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించేలా ఇకపై ఆన్‌లైన్ అడ్మిషన్ విధానం ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది.

మార్చిలో ఎలిఫెంట్ గేట్ ఫ్లైఓవర్ ప్రారంభం

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: స్థానిక ఎలిఫెంట్ గేట్ ఫ్లైఓవర్‌ను మార్చిలో ప్రారంభించనున్నట్లు చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. వాల్‌టాక్స్ రోడ్డు, పెరియమేడు ప్రాంతాలను అనుసంధానం చేసే ఎలిఫెంట్ గేట్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.43.75 కోట్లతో జరుగుతున్న ఈ పనులు ముగింపు దశకు చేరుకోవడంతో మార్చి నెలాఖరులో ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు.

రైల్వే కార్మిక సంఘాల ఎన్నికలు వాయిదా

పెరంబూర్, ఫిబ్రవరి 13: రైల్వే కార్మిక సంఘ ఎన్నికలు పార్లమెంటు ఎన్నికల తరువాత నిర్వహించనున్నట్లు రైల్వే బోర్డు తెలిపింది. 2013లో జరిగిన ఎన్నికల్లో ఎస్సార్ఎంయూ 43 శాతం ఓట్లు సాధించింది. కరోనా కారణంగా 2019 తర్వాత కార్మిక సంఘ ఎన్నికలు నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో, ఢిల్లీ హైకోర్టులో ఎన్నికలకు సంబంధించి దాఖలైన పిటిషన్ గత ఏడాది జూలైలో విచారణకు రాగా, నాలుగు నెలల్లో ఎన్నికలు నిర్వహిస్తామని రైల్వే బోర్డు తెలిపింది. దీంతో, రైల్వే బోర్డు పరిధిలోని 17 మండలాల్లో పనిచేస్తున్న 12.20 లక్షల మంది కార్మికుల ఆదరణ పొందేందుకు కార్మిక సంఘాలు ప్రచారం చేపట్టాయి. కానీ, త్వరలో పార్లమెంటు ఎన్నికలు రానున్న నేపథ్యంలో, ఈ ఎన్నికలను జూలై లేదా ఆగస్టులో నిర్వహించనున్నట్లు రైల్వే బోర్డు వర్గాల సమాచారం.

భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఏర్పాటుచేయాలి

సీఎంకు వినతి

అడయార్, ఫిబ్రవరి 13: వేళచ్చేరి నియోజకవర్గంలో భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థను నిర్మించాలని, ఇందుకోసం ప్రభుత్వం రూ.40 కోట్లు కేటాయించాలని ఎమ్మెల్యే హాసన్ మౌలానా కోరారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం ఒక పత్రికా ప్రటనను విడుదల చేశారు. తన నియోజకవర్గంలో ప్రజల వద్దకే ముఖ్యమంత్రి పథకం కింద అనేక సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. 2023-24 సంవత్సరంలో నియోజకవర్గవ్యాప్తంగా అనేక అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. ఇందులోభాగంగా భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ నిర్మాణం కోసం రూ.40 కోట్లు కేటాయించాలని కోరుతున్నట్లు ఆయన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

డీజీపీ కార్యాలయంలో ఎన్నికల విభాగం

ప్యారీస్, ఫిబ్రవరి 13:స్థానిక మైలాపూర్‌లోఉన్న డీజీపీ కార్యాలయ ప్రాంగణంలో పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక విభాగాన్ని ఏడీజీపీ మహేష్‌కుమార్ అగర్వాల్ ప్రారంభించారు. పార్లమెంటు ఎన్నికల పనుల నిమిత్తం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే పోలీసులు, పారామిలిటరీ బలగాలను చెన్నైనుంచి ఇతర జిల్లాలకు తరలించే ప్రక్రియను పరిశీలించేందుకు ఏడీజీపీ జయరామన్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది. అలాగే, గ్రేటర్ చెన్నై పోలీస్ కమిషనర్ కార్యాలయంలో అడిషినల్ కమిషనర్ శ్రీనివాసన్ నేతృత్వంలో ఎన్నికల కంట్రోల్ రూం ఏర్పాటైంది. దీనితోపాటు డీజీపీ కార్యాలయంలోఏర్పాటైన ఎన్నికలకంట్రోల్‌రూంలు 24 గంటలు షిఫ్టుపద్ధతిలోపనిచేస్తాయని అధికారులు తెలిపారు.

సబర్బన్ రైలు నుంచి పొగలు

పెరంబూర్, ఫిబ్రవరి 13: తిరువళ్లూర్ సమీపంలో సబర్బన్ రైలులో హఠాత్తుగా పొగలు రేగడంతో ప్రయాణికులు బోగీల నుంచి కిందకు దూకి పరుగులు తీశారు. వేలూరు కంటోన్మెంట్ నుంచి చెన్నై బీచ్‌కు మంగళవారం ఉదయం సబర్బన్ రైలు బయల్దేరింది. అరక్కోణం మార్గంగా తిరువళ్లూర్ వైపుకు సెంజిమనపాక్కం - కడంబత్తూర్ రైల్వేస్టేషన్ మధ్యలో బ్రేక్ సిస్టమ్ ఒత్తిడి కారణంగా బ్యాటరీ నుంచి పొగలు వెలువడ్డాయి. దీంతో డ్రైవర్ రైలును నిలిపివేశాడు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు, సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు అదుపుచేశారు. 30 నిముషాల తర్వాత రైలును కడంబత్తూర్ రైల్వేస్టేషన్‌కు తీసుకొచ్చిన అధికారులు, రైలు నడిపేందుకు అవకాశముందా అని డ్రైవర్‌ను అడిగి తెలుసుకున్నారు. 20 నిమిషాల అనంతరం రైలును తిరువళ్లూర్ స్టేషన్‌కు చేరుకుంది. ఈ కారణంగా పాఠశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు సిబ్బంది సకాలంలో వెళ్లలేకపోయారు.



రైలు నుంచి దిగుతున్న ప్రయాణికులు (అంతర్ చిత్రంలో) బ్యాటరీ బాక్స్ నుంచి వస్తున్న పొగలు

యువతి ప్రాణం తీసిన మాదకద్రవ్యాల వ్యసనం

పెరంబూర్, ఫిబ్రవరి 13: మాదకద్రవ్యాల కారణంగా యువతి మృతిచెందిందా అనే విషయమై ప్రియుడిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. నీలగిరి జిల్లా ఊటీ బాంబే క్యాసిల్ ప్రాంతానికి చెందిన ఆకాష్ (20), ఊటీ ఫింగర్ పోస్ట్ ప్రాంతానికి చెందిన రీతిఏంజెల్ (19) ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుకుంటున్నప్పటి నుంచి ఇరువురి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ప్రస్తుతం రీతి ఏంజెల్ కోవైలోని ఓ ప్రైవేటు నర్సింగ్ కళాశాలలో, ఆకాష్ నీలగిరిలోని ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో చదువుకుంటున్నారు. వారివురు తరచూ కలుసుకునేవారు. ఈ నేపథ్యంలో సెలవులు రావడంతో గత శనివారం రితిఏంజెల్ ప్రియుడిని కలుసుకొనేందుకు కోవై నుంచి ఊటీ వచ్చింది. ఆమెను ఆహ్వానించిన ఆకాష్ సమీపంలోని టాస్మాక్ దుకాణానికి వెళ్లి మద్యం తీసుకొని తన ఇంటికి వెళ్లాడు. ఆన్‌లైన్‌లో భోజనానికి ఆర్డరు చేసిన అనంతరం మద్యం తాగారు. అనంతరం ద్విచక్రవాహనంలో పైన్ ఫారెస్ట్‌కి వెళ్లి మ్యాజిక్ మష్రూమ్ అనే మాదకద్రవ్యం కొనుగోలు చేసి మద్యంలో కలుపుకొని తాగి, మత్తులో నిద్రపోయారు. ఉదయం లేచిన ఆకాష్, రీతిఏంజెల్‌ను లేపగా ఆమె లేవకపోవడంతో ఆందోళన చెందిన 108 అంబులెన్స్‌ను రప్పించారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది ఆమెను పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ వ్యవహారంపై తొలుత సందేహాస్పద మరణం కింద కేసు నమోదుచేసిన పోలీసులు అనంతరం హత్యానేరం కాని మరణం కింద కేసు నమోదుచేసి ఆదివారం ఆకాష్‌ను అరెస్ట్ చేశారు.



మృతురాలు రితిఏంజెల్ (ఫైల్ ఫొటో)

ఇక్కడికెందుకొచ్చినట్లు?

మాజీ మంత్రిని ప్రశ్నించిన సుప్రీంకోర్టు

ప్యారీస్, ఫిబ్రవరి 13: మద్రాసు హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, సుప్రీంకోర్టుకు ఎందుకొచ్చారని అన్నాడీఎంకే మాజీ మంత్రి వలర్మతిని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. 2001-06 సంవత్సరాల మధ్య రాష్ట్రంలో అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలో ఉండగా, రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రిగా వ్యవహరించిన వలర్మతి, ఆదాయానికి మించి ఆస్తులు వెనకేసుకున్నారని కేసు నమోదైంది. ఈ కేసును హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేశ్ సుమోటాగా స్వీకరించి విచారణ జరుపుతున్నారు. ఈ విచారణపై స్టే కోరుతూ వలర్మతి తరపున సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు అనిరుధ్‌బోస్, సంజయ్‌కుమార్‌ల నేతృత్వంలో బెంచ్ ముందు సోమవారం విచారణకు రాగా, పిటిషనర్ తరపు న్యాయవాది, విచారణ మరో తేదీకి వాయిదా వేయాలంటూ వాదించారు. అప్పుడు జోక్యం చేసుకున్న న్యాయమూర్తుల బెంచ్... మాజీ మంత్రులకు సంబంధించిన అవినీతి కేసులపై మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ విచారణ జరుపుతున్న నేపథ్యంలో, ఇలాంటి కేసులపై తాము ఎందుకు విచారణ జరపాలని, ముందు హైకోర్టును ఆశ్రయించాకే, ఆ ఉత్తర్వుల్లో ఏదైనా అవసరమైన పక్షంలోనే సుప్రీంకోర్టు రావాలని ఆదేశించి, ఈ కేసు తదుపరి విచారణ ఈనెల 27కు వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

నైజీరియన్ ఖైదీ వద్ద విచారణ

ప్యారీస్, ఫిబ్రవరి 13: కొకైన్ మత్తుపదార్థాన్ని తరలించిన వ్యవహారంలో స్థానిక పుళల్ జైలులో బంధీగా ఉన్న నైజీరియాకు చెందిన చింటూ ఒనాసి వద్ద సైబర్ క్రైం పోలీసులు మంగళవారం విచారణ జరిపారు. ముంబై, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి తరలించే కొకైన్‌ను చెన్నైలో పలు ప్రాంతాల్లో విక్రయించిన నైజీరియా దేశస్థులు చింటూ ఒనాసి, ఆయన భార్య సియామిఖాయ్, మిత్రుడు సియోఇన్సెలక్‌ను గత నెల అమింజికరై పోలీసులు అరెస్ట్ చేశారు. వారి సమాచారం మేరకు అన్నానగర్, పెరుంబాక్కం, వ్యాసర్పాడిలకు చెందిన అనిరుధ్ చౌదరి, వాల్‌శ్యా, నితోష్ పరిహర, చోటార్‌ను అరెస్ట్ చేసి పుళల్ జైలుకు తరలించారు. మత్తు పదార్థాలు చెన్నైకి ఎలా చేరవేశారు అన్న దానిపై సమగ్ర విచారణ జరిపేందుకు పుళల్ జైల్లో బంధీగా ఉన్న చింటూ ఒనాసీని తమ కస్టడీకి అప్పగించాలంటూ సైబర్ క్రైం పోలీసులు ఎగ్మూర్ మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం అనుమతితో చింటూను గత నెల 30న పుళల్ జైలుకెళ్లి తమ కస్టడీకి తీసుకున్న పోలీసులు విచారణ పూర్తికావడంతో మళ్లీ మంగళవారం జైలుకు తరలించారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

వేలూరు, ఫిబ్రవరి 13: స్థానిక ముత్తురంగం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వివిధ పోటీల విజేతలకు కలెక్టర్ సుబ్బులక్ష్మి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో తమిళ అభివృద్ధి శాఖ ఉప డైరెక్టర్ నాగరాజన్, కళాశాల ప్రిన్సిపాల్ అమలర్, తమిళ పండితులు పదుమనార్, కవి శివరాజి, కప్పన్, తమిళ్ సెల్వన్ తదితరులు పాల్గొన్నారు.


శాస్త్రోక్తంగా గాంగేశ్వరన్ ఆలయ కుంభాభిషేకం



కుంభాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

వేలూరు, ఫిబ్రవరి 13: స్థానిక కాట్పాడి సమీపం గాంగేయనల్లూర్‌లో ప్రసిద్ధిచెందిన బాలకుజాంబల్ సమేత గాంగేశ్వర్ ఆలయ పునర్నిర్మాణ అష్టబంధన మహాకుంభాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమంలో భాగంగా ఆరు కాల పూజలు, హోమం, విశేష ద్రవ్యాలతో హోమం, సంకల్పం తదితరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల అనంతరం ప్రధాన కలశాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం వాటిని రాజగోపురంపై చేర్చి పుణ్యనదుల నుంచి సేకరించిన జలాలు ప్రోక్షించి కుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో కార్పొరేషన్ 10వ వార్డు అన్నాడీఎంకే కౌన్సిలర్ రమేష్ పాల్గొన్నారు.

దుకాణాల లైసెన్స్ రెన్యువల్ చేసుకోండి



యజమానులకు అప్లికేషన్స్ ఇస్తున్న అధికారి శివకుమార్

వేలూరు, ఫిబ్రవరి 13: కార్పొరేషన్ పరిధిలోని 1వ మండలంలో 500 దుకాణాలతో కూడిన వ్యాపార కాంప్లెక్స్ ఉంది. ఈ దుకాణాల లైసెన్స్‌ను యేటా రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. ఈ క్రమంలో, ఈ సంవత్సర రెన్యువల్ చేసుకొనేందుకు 1వ మండల ఆరోగ్య అధికారి శివకుమార్ నేతృత్వంలో సిబ్బంది దుకాణ యజమానులకు అప్లికేషన్స్ అందజేశారు. నిర్ణీత సమయంలో లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

తమిళగ వెట్రి కళగం ర్యాలీ



ర్యాలీలో కార్యకర్తలు

వేలూరు, ఫిబ్రవరి 13: గుడియాత్తం నియోజకవర్గంలో మంగళవారం తమిళగ వెట్రి కళగం పార్టీ తరపున ర్యాలీ నిర్వహించారు. సినీ నటుడు విజయ్ ఇటీవల తమిళగ వెట్రి కగళం పార్టీ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆ పార్టీ గుడియాత్తం యూనియన్ అధ్యక్షుడు కలైసెల్వన్ నేతృత్వంలో, తొలుత పెరియార్, గాంధీ, కామరాజర్ విగ్రహాలకు నివాళి అర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగలింగం, విల్వనాథన్, కుమరేశన్, రాజేష్, దినేష్‌కుమార్ సహా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాచార శాఖ డైరెక్టర్‌గా వైద్యనాథన్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్‌గా వైద్యనాథన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆ పదవిలో వున్న మోహన్ ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. వైద్యనాథన్ ఇప్పటి వరకూ తిరుచ్చి కార్పొరేషన్ కమిషనర్‌గా వ్యవహరించారు. ఆయన్ని సమాచారశాఖ డైరెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు.



విజేతలకు సర్టిఫికెట్ల పంపిణీ



గెలుపొందిన జట్టుకు సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

వేలూరు, ఫిబ్రవరి 13: స్థానిక కాట్పాడి సమీపంలోని కింగ్స్ మెట్రిక్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి అండర్-17 ఖోఖో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో గుడియాత్తం జ్యోతి ఉన్నత పాఠశాల మొదటి బహుమతి, వేలూరు కొనవట్టం మెట్రిక్యులేషన్ పాఠశాల రెండో బహుమతి, దేవరిషికుప్పం ప్రభుత్వ ఉన్నత పాఠశాల జట్టు మూడో బహుమతి గెలుచుకున్నాయి. విజేతలకు తమిళనాడు అమెచ్యూర్ ఖోఖో రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

'గెట్ అవుట్ రవి' హాష్‌ట్యాగ్

'ఎక్స్' ట్రెండింగ్‌లో ప్రథమస్థానం

పెరంబూర్, ఫిబ్రవరి 13: ఎక్స్ యాప్‌లో 'గెట్ అవుట్ రవి' అనే హాష్‌ట్యాగ్ జాతీయస్థాయి ట్రెండింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్ర శాసనసభలో సోమవారం ప్రభుత్వ ప్రసంగాన్ని గవర్నర్ చదివేందుకు ఆసక్తి చూపలేదు. దీంతో, స్పీకర్ అప్పావు ఆ ప్రసంగాన్ని తమిళంలో చదివి వినిపించారు. ప్రసంగం ముగిసిన వెంటనే గవర్నర్ సమావేశం హాలు నుంచి వెళ్లిపోయారు. గవర్నర్ చర్యలను పలువురు తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై 'ఎక్స్' యాప్‌లో #Getout Ravi అనే హాష్‌ట్యాగ్ దేశంలోనే ట్రెండింగ్‌లో ప్రథమస్థానంలో నిలిచింది.

కపాలేశ్వర ఆలయ ద్వారానికి నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, ఫిబ్రవరి 13: స్థానిక మైలాపూర్‌లో ప్రసిద్ధిచెందిన కపాలేశ్వర ఆలయ ప్రవేశద్వారానికి నిప్పంటించిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నిత్యం రద్దీగా ఉంటే కపాలేశ్వర ఆలయ ప్రవేశద్వారం ముందు కూర్చున్న ఓ వ్యక్తి, కొన్ని వస్తువులకు నిప్పంటిస్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. దీనిపై ఆలయ అధికారి బాలమురుగన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సంబంధిత వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు, ఆలయ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా ప్యారీస్ కార్నర్‌లో సంచరించిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఆ వ్యక్తి మతిస్థిమితం కోల్పోయాడని, అతను ఆలయం చుట్టుపక్కల ఉన్న చెత్త సేకరించి వాటికి నిప్పంటించినట్లు విచారణలో తెలిసింది.

6, 7, 8 తరగతుల విద్యార్థులకు ప్రాథమిక అంచనా పరీక్ష

ఐసిఎఫ్, ఫిబ్రవరి 13: ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో 6 నుంచి 8వ తరగతి వరకు చదివే విద్యార్థులకు ప్రాథమిక అంచనా పరీక్ష నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఉన్నత సాంకేతిక ల్యాబ్‌ల ద్వారా ఈ నెల 20వ తేదిలోపు ఈ పరీక్ష పూర్తి చేయాలని, ఒక్కో విద్యార్థి 10 ప్రశ్నలకు జవాబులివ్వాల్సి ఉంటుందని పాఠశాల విద్యాశాఖ పేర్కొంది. ఈ పరీక్షను 40 నిమిషాల్లోపు ఒక్కో విద్యార్థికి నిర్వహించాలని, ల్యాబ్‌లో ఉన్నత పాఠశాల విద్యార్థులైతే 10 మందిని, మహోన్నత పాఠశాల అయితే 20 మందిని అనుమతించాలని పాఠశాల హెచ్‌ఎంలకు ఉత్తర్వులు జారీ చేసింది.

మహిళ కడుపు నుంచి 6 కిలోల కణితి తొలగింపు



విలేకరుల సమావేశంలో వైద్యబృందం, లలిత

చెన్నై, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి):ఆళ్వారుపేటలోని గిరీశ్వరి ఆసుపత్రివైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి మహిళ కడుపు నుంచి ఆరు కిలోల కణితిని తొలగించారు. వివిధ రకాల సమస్యలతో తమ వద్దకు వచ్చిన 63 ఏళ్ల లలిత అనే మహిళను పరీక్షించిన గిరీశ్వరి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ మంగై శరవణన్ ఆమెపొత్తికడుపులో ఆరు కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. అంతేగాకుండా మూత్రనాళాల్లో సమస్యవున్నట్లు గుర్తించారు. రోగికి క్షణక్షణానికి పరిస్థితి విషమిస్తుండడంతో ముందుగా ఆక్సిజన్ సపోర్టు అందించారు. సుదీర్ఘ శస్త్రచికిత్స నిర్వహించి, కణితినితొలగించారు. దీనిగురించి డాక్టర్ మంగై శరవణన్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ శస్త్రచికిత్స సవాల్‌తో కూడుకున్నదని తెలిపారు. ఈసందర్భంగా లలిత మంగై శరవణన్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

జూన్ తర్వాతే ఫార్ములా-4 కార్ రేస్

హైకోర్టుకు తెలిపిన రాష్ట్రప్రభుత్వం

పెరంబూర్, ఫిబ్రవరి 13: స్థానిక ఐల్యాండ్ గ్రౌండ్స్ చుట్టూ ఫార్ములా-4 కార్ రేస్ నిర్వహించనున్నట్లు మద్రాసు హైకోర్టుకు రాష్ట్రప్రభుత్వం తెలియజేసింది. ఐల్యాండ్ గ్రౌండ్స్‌లో గత డిసెంబరు 9, 10 తేదీల్లో ఫార్ములా-4 ఇండియా ఛాంపియన్ షిప్, ఇండియన్ రేసింగ్ లీగ్ నైట్ స్ట్రీట్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రప్రభుత్వం సహకారంతో రేసింగ్ ప్రమోషన్ సంస్థ ఈ పోటీల ఏర్పాట్లు చేపట్టగా, మిచౌంగ్ తుపాను, భారీవర్షాల కారణంగా పోటీలు వాయిదా పడ్డాయి. ఈ పోటీలతో ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశముందని, వాటిని ఇరుగాంట్టుకోటలో నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ కేసు విచారణ మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి మహాదేవన్, న్యాయమూర్తి మహమ్మద్ సఫీక్‌తో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. ఆ సమయంలో, ఐల్యాండ్ గ్రౌండ్స్ చుట్టూ ఫార్ములా-4 కార్ రేస్ నిర్వహణకు సైనిక, నావికాదళం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు పొందామని, ఈ పోటీలు నిర్వహించే ప్రాంతం ఓమందూర్ ఆసుపత్రికి 100 మీటర్ల దూరంలో ఉందని, అధిక శబ్దం లేకుండా చర్యలు చేపడతామని, జూన్ తర్వాతే ఈ పోటీలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అఫిడివిట్ దాఖలు చేసింది. అనంతరం ధర్మాసనం... కార్ రేస్ నిర్వహణకు ప్రభుత్వం రూ.40 కోట్లు ఖర్చుచేయడం తప్పు అని పేర్కొంటూ, పోటీలపై స్టే విధించే విషయమై ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది.

16 నుంచి ఎన్నికల ప్రచార సభలు

● మంత్రి ఉదయనిధి స్టాలిన్



ప్యారీస్, ఫిబ్రవరి 13: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని డీఎంకే తరఫున ఈ నెల 16, 17, 18 తేదీల్లో ప్రచార సభలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయని ప్రకటించారు. ఉరిమిగళై మీక్క స్టాలిన్ కురల్ పేరుతో పార్లమెంటు నియోజకవర్గాల వారీగా డీఎంకే ప్రచార సభలు నిర్వహించనుంది. సభలను విజయవంతానికి పార్లమెంటు ఎన్నికల సమన్వయ కమిటీ, డీఎంకే జిల్లా కార్యదర్శులు, మంత్రులతో వీడియో కాన్ఫరెన్సింగ్‌లో ఉదయనిధి పాల్గొన్నారు. కలైంజర్ గృహిణిల ఆర్థికసాయం పథకానికి మంచి గుర్తింపు వచ్చిందని, ఇప్పటివరకు 1.15 కోట్ల మందికి పైగా మహిళలు లబ్ధిపొందారని తెలిపారు. రాష్ట్రంలో నిధుల సమస్య కొనసాగుతున్నప్పటికీ, అర్హత కలిగిన 85 నుంచి 90 శాతం మహిళలకు ప్రతి నెలా రూ.1,000 వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం కూడా అమలుజరుగుతుందని, ఈ పథకం వల్ల ఒక్కొక్క మహిళ నెలకు సుమారు రూ.900 పొదుపు చేస్తున్నారని తెలిపారు. 'పుదుమై పెణ్' పథకం 2.71 లక్షల మంది విద్యార్థినులు, ముఖ్యమంత్రి అల్పాహార పథకం ద్వారా సుమారు 17 లక్షలమంది పిల్లలు లబ్ధిపొందుతున్నారని తెలిపారు. ఈ పథకాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఇటీవల తమిళనాడు అధోగతికి చేరుకుందని చేసిన వ్యాఖ్యలు వాస్తవం కాదని, దీనిపై కూడా విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి స్టాలిన్ పుట్టినరోజు సందర్భంగా ఉత్తర, మధ్య, దక్షిణ చెన్నైలలోని పార్లమెంటు నియోజకవర్గాల్లో మార్చి 1వ తేది భారీస్థాయిలో వేడుకలు జరుపుకోవాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని చెన్నైవాసి మృతి

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 13: తిరుపతి జిల్లా నాయుడుపేట - పూతలపట్టు జాతీయ రహదారిపై వకుళమాత ఆలయ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చెన్నైకి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. సదరు వ్యక్తి చెన్నైలోని రామలింగనగర్‌కు చెందిన అర్జున్‌కాంత్(38) గా పోలీసులు గుర్తించారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తిరుపతి రూరల్ ఎస్ఐ షేక్ షావలి తెలిపారు.



అర్జున్‌కాంత్ మృతదేహం

తిరునెల్వేలి ఎస్పీకి పీడీ యాక్ట్ జారీ

పెరంబూర్, ఫిబ్రవరి 13: కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసులో హాజరుకాని తిరునల్వేలి జిల్లా ఎస్పీకి పీడీ యాక్ట్ జారీ అయ్యింది. తిరునల్వేలి జిల్లాకు చెందిన సయ్యద్... హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో గత ఏడాది కోర్టు ఉత్తర్వులు ఉల్లంఘన పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు గురించి సమాధానం చెప్పేందుకు తిరునల్వేలి జిల్లా ఎస్పీ నేరుగా హాజరుకావాలని హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ న్యాయమూర్తి పుహళేంది ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, ఇటీవల జరిగిన విచారణకు ఎస్పీ హాజరు కాకపోవడంతో, ఆయనకు బెయిలు పొందలేని పీడీ యాక్ట్ జారీ చేసిన న్యాయమూర్తి, తదుపరి విచారణ ఈనెల 14న బుధవారానికి వాయిదా వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సెంథిల్ బాలాజీ రాజీనామా మా పార్టీ తొలి విజయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై

పెరంబూర్, ఫిబ్రవరి 13: సెంథిల్ బాలాజీ తన మంత్రి పదవికి రాజీనామా చేయడం తమ పార్టీకి తొలి విజయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై వ్యాఖ్యానించారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని ఆర్కే నగర్‌లో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని అన్నామలై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్పీకర్‌కు పార్టీ తరపున మాట్లాడేందుకు ఎలాంటి అధికారం లేదన్నారు. శాసనసభలో స్పీకర్ తటస్థంగా వ్యవహరించలేదని, ఆయన డీఎంకే కార్యకర్తలా మాట్లాడారన్నారు. అందువల్లనే గవర్నర్ శాసనసభ నుంచి వెళ్లిపోయారని తాను భావిస్తున్నానని తెలిపారు. గవర్నర్‌కు అందజేసిన ప్రసంగంలో 10 అబద్ధాలను గుర్తించామని, వాటిని రాసిచ్చి ప్రభుత్వాన్ని పొగడాలి అంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. అవినీతి కేసులో అరెస్టయిన సెంథిల్ బాలాజీ శాఖ లేని మంత్రిగా 8 నెలలు కొనసాగారని, తాజాగా ఆయన తన పదవికి రాజీనామా చేయడం బీజేపీ తొలి విజయంగా భావిస్తున్నామని అన్నామలై పేర్కొన్నారు.

మెడికల్ లీవులో పెరియార్ వర్శిటీ రిజిస్ట్రార్

పెరంబూర్, ఫిబ్రవరి 13: సేలం పెరియార్ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ తంగవేలు మెడికల్ లీవుపై వెళ్లారు. తన విభాగానికి అవసరమైన పరికరాల కొనుగోలులో రిజిస్ట్రార్ తంగవేలు అవినీతిని పాల్పడ్డారని ఆరోపణలొచ్చాయి. ఈ వ్యవహారంపై ఆడిట్ కమిటీ విచారణ చేపట్టి, ఆరోపణలు వాస్తవాలుగా నిర్ధారించింది. రిజిస్ట్రార్‌పై వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో తంగవేలును సస్పెండ్ చేయాలని వర్శిటీ ఉపకులపతికి ఉన్నత విద్యాశాఖ సిఫారసు చేసింది. ఈ సిఫారసులతో రిజిస్ట్రార్ తంగవేలుపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ నేపథ్యంలో, రిజిస్ట్రార్ తంగవేలు ప్రస్తుతం మెడికల్ లీవుపై వెళ్లారు. ఈ నెలాఖరులో తంగవేలు పదవీవిరమణ పొందనున్న నేపథ్యంలో, 12 రోజులు మెడికల్ సెలవులపై వెళ్లడం గమనార్హం.

లంక జైలు నుంచి తిరిగొచ్చిన 28 మంది తమిళ జాలర్లు

ప్యారీస్, ఫిబ్రవరి 13: బంగాళాఖాతంలో చేపల వేటకు వెళ్లి సరిహద్దులు దాటారన్న కారణంగా శ్రీలంక నావికాదళం అరెస్ట్‌చేసి జైలుకు తరలించిన 28 మంది తమిళ జాలర్లు విడుదలై విమానం ద్వారా చెన్నైకి చేరుకున్నారు. రామనాథపురం జిల్లాకు చెందిన 18 మంది జాలర్లు జనవరి 16వ తేది తెల్లవారుజామున రెండు పడవల్లో సముద్రంలో చేపల వేట సాగిస్తుండగా అటుగా వచ్చిన శ్రీలంక నావికాదళం వారిని అరెస్ట్ చేసి రెండు పడవలు స్వాధీనం చేసుకుంది. అనంతరం శ్రీలంక న్యాయస్థానంలో హాజరుపరచి రిమాండ్‌కు తరలించింది. ఈక్రమంలో నాగపట్టినం జిల్లాకు చెందిన 10 మంది జాలర్లను కూడా లంక నావికా దళ అధికారులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. జాలర్లను విడిపించాలంటూ ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌కు సీఎం స్టాలిన్ లేఖ రాశారు. దీంతో, శ్రీలంకలో ఉన్న భారత రాయబార కార్యాలయ అధికారులు ఆ దేశ ప్రభుత్వ అధికారులతో జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో, శ్రీలంక న్యాయస్థానం విడుదల చేసిన 28 మంది రాష్ట్ర జాలర్లు ఎయిర్ ఇండియా విమానం ద్వారా మంగళవారం తెల్లవారుజామున చెన్నైకి తిరిగొచ్చారు. వారిని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు వారి సొంత ప్రాంతాలకు ప్రత్యేక వాహనాల ద్వారా సాగనంపారు.

వచ్చే వారంలో డీఎంకేతో కమల హాసన్ చర్చలు?

అడయార్, ఫిబ్రవరి 13: పార్లమెంట్ ఎన్నికల్లో పొత్తు, సీట్ల పంపిణీపై డీఎంకే అధిష్ఠానంతో ఎంఎన్ఎం అధ్యక్షుడు, సినీ హీరో కమలహాసన్ వచ్చే వారం సమావేశమై చర్చించే అవకాశం ఉందని ఎంఎన్ఎం పార్టీ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న కమల్ సోమవారమే నగరానికి రావాల్సి ఉండగా, అనివార్య కారణాలతో రాలేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన ఆయన చెన్నైకి వస్తారని ఆ తర్వాత సీట్ల పంపిణీ తదితర అంశాలపై వచ్చే వారంలో డీఎంకే నేతలతో చర్చలు జరిపే అవకాశం ఉందని ఆ పార్టీ నేతలు సూచనప్రాయంగా వెల్లడించారు. అయితే, ప్రస్తుతం జరుగుతున్న బడ్జెట్ సమావేశాలు ఈ నెల 22వ తేదీతో ముగుస్తాయి. 23వ తేదీ లేదా 24 తేదీల్లో ఆయన డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్‌తో సమావేశమై చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది.

గుడియాత్తం తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



వేలూరు, ఫిబ్రవరి 13: గుడియాత్తం రెవెన్యూ తహసీల్దార్‌గా సుబ్బులక్ష్మి మంగళవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. ఆమెకు బీడీఓలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, పలు శాఖల అధికారులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని తహసీల్దార్ సుబ్బులక్ష్మి ఈ సందర్భంగా తెలిపారు.

ఈ సినిమా కోసం మ్యాజిక్ నేర్చుకున్నా

● హీరో సతీష్



ఆడియో రిలీజ్ దృశ్యం

'నాయ్ శేఖర్, 'కంజూరింగ్ కన్నప్పన్' వంటి చిత్రాల తర్వాత హాస్య నటుడు సతీష్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'విద్దైకారన్'2. వైట్ కార్పెట్ ఫిలిమ్స్ బ్యానరుపై నిర్మాత కె.విజయ్ పాండి నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ వెంకి రూపొందించారు. బ్లాక్ కామెడీ జోనర్‌లో తెరెక్కించిన ఈచిత్రం ఈనెల 23న విడుదలకు సిద్ధమైంది. ఈ చిత్రం విశేషాలను చిత్ర బృందం చెన్నైలో విలేకరుల సమావేశంలో పేర్కొంది. హీరో సతీష్ మాట్లాడుతూ... 'రూ.25 కోట్ల డైమండ్‌ను నేను, ఆనంద్‌రాజ్, మధుసూదనన్, సుబ్రమణ్య శివతో కూడిన బృందం స్వాధీనం చేసుకోవాలని భావిస్తాం. ఇందులో ఎవరు విజయం సాధించారన్న స్టోరీని బ్లాక్ కామెడీ జోనర్‌లో దర్శకుడు రూపొందించారు. నేను ద్విపాత్రాభినయం చేశా. ఒక క్యారెక్టర్ మెజీషియన్ రోల్. ఈ పాత్ర కోసం ఒకరి వద్ద మ్యాజిక్ నేర్చుకున్నా. మరో క్యారెక్టర్ సస్పెన్స్. 40 శాతానికిపైగా సన్నివేశాలను ఎయిర్‌పోర్టులో చిత్రీకించాం. ఈ సినిమాలో నేను కామెడీ చేయలేదు. నాతోపాటు ఉండే వారితో క్యామెడీ చేయిం చి నేను నటించా. 'చట్టం ఎన్ కైయిల్' అనే చిత్రంలో నటిస్తున్నా. హీరోయిన్‌గా సిమ్రన్ గుప్తా నటించారు. ఆనంద్‌రాజ్, మధుసూదనన్, సుబ్రమణ్య శివ, జాన్ విజయ్, ఆసిఫ్ అలీ, పావెల్ జపాన్ కుమార్, శామ్స్, స్వామినాథన్, మారిముత్తు తదితరులు ఇతర పాత్రలను పోషించారు' అని వివరించారు. దర్శకుడు వెంకి మాట్లాడుతూ... 'స్క్రిప్టును సిద్ధం చేసుకుని అనేక మంది నిర్మాతలను కలిశాను. కానీ ఏ ఒక్కరూ అవకాశం ఇవ్వలేదు. అయితే, నిర్మాత విజయ్‌ను కలసి కథ వివరించగానే ఒకే చెప్పారు. ఒక నిర్మాతగా నేను అడిగినవన్నీ ఆయన సమకూర్చారు. సినిమా చూశాక ఈ విషయం మీకే తెలుస్తుంది. ఈ సినిమాలో పలువురు కొత్త ముఖాలు పనిచేశారు. వారందరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

మూగ యువతిగా అనుపమ

ప్రముఖ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ మూగ యువతి పాత్రలో కనిపించనున్నారు. జయం రవి హీరోగా నిర్మితమై విడుదలకు సిద్ధంగావున్న 'సైరన్' లో ఆమె ఈ పాత్రను పోషించారు. ఇందులో మరో హీరోయిన్ కీర్తి సురేష్, ఆమె పోలీస్ అధికారిగా నటించారు. గతంలో 'కొడి' ద్వారా వెండితెరకు పరిచయమైన అనుపమ పరమేశ్వరన్... చాలా కాలం తరువాత కోలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. అయితే, ఆమె మూగ పాత్రధారిగా హీరో భార్యగా కనిపించనున్నారు. ఈ పాత్రపై ఆమె ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమా తర్వాత తనకు తమిళంలో కూడా వరుస అవకాశాలు వస్తాయని భావిస్తున్నారు. కాగా, అనుపమ పరమేశ్వరన్‌కు కోలీవుడ్‌లో 'ప్రేమమ్' చిత్రం తర్వాత సరైన హిట్ లేకపోవడం గమనార్హం.

చిత్రజ్యోతి



అనుపమ పరమేశ్వరన్

'బైరి' మా బ్యానర్‌కు మంచి పేరు తెస్తుంది

● శక్తివేలన్



విజీ శేఖర్, సయ్యద్ మజీద్, మేఘ్న

ఈ యేడాది ఉత్తమ చిత్రాల్లో 'బైరి' చిత్రం ఒకటిగా ఉండటమే కాకుండా మా బ్యానర్‌కు మంచి పేరు తెచ్చిపెడుతుందని శక్తి ఫిల్మ్ అధినేత, నిర్మాత శక్తివేలన్ విశ్వాసం వ్యక్తం చేశారు. డీకే ప్రొడక్షన్స్ బ్యానరుపై వి.దురైరాజ్ నిర్మాణంలో జాన్‌గ్లాడి దర్శకత్వంలో సయ్యద్ మజీద్, మేఘ్న ఎలెన్, విజీ శేఖర్ నటించిన చిత్రం 'బైరి'. తల్లీకు మారుడి సెంటిమెంట్, పావురాల పోటీ నేపథ్యంలో రూపొందించారు. ఈ నెల 23న చిత్రం విడుదలకానుంది. దీన్ని పురస్కరించుకుని చిత్రం ఆడియోను తాజాగా విడుదల చేశారు. చిత్ర దర్శకుడు జాన్‌గ్లాడి మాట్లాడుతూ... 'బైరి' అనేది ఒక రకమైన డేగ. పావురాలను వెంటాడే రకం. ఈ పావురం రేసింగ్ కథ నా జీవితంలో నేను చూసిన సంఘటనల ఆధారంగా తెరకెక్కించా. కెమెరామెన్ వసంత్ షార్ట్‌ఫిల్మ్ తీయడం మొదలుపెట్టినప్పటి నుంచి నాకు తెలుసు. ఈ సినిమా చేయడానికి ఆయనే కారణం. 'తడమ్' ఫేం అరుణ్ సంగీతం అందించారు. బడ్జెట్ విషయంలో ఏమాత్రం రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించిన నిర్మాతకు ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. హీరో సయ్యద్ మజీద్ మాట్లాడుతూ... 'నేను 14 యేళ్లుగా చిత్రపరిశ్రమలో ఉన్నా. అనేక షార్ట్ ఫిలిమ్స్‌లో నటించా. వెండితెరపై చూసుకోవాలన్న కోరిక తీరింది. ఈ సినిమాను చూసిన శక్తివేలన్‌ను మెచ్చుకుంటారు. ఈ సినిమా తర్వాత దర్శకుడికి వరుస అవకాశాలు వస్తాయని ఆశిస్తున్నా' అని పేర్కొన్నారు. శక్తి ఫిల్మ్ ఫ్యాక్టరీ అధినేత శక్తివేలన్ మాట్లాడుతూ... 'నేను ఈ చిత్రానికి గుర్తింపు ఇవ్వడం లేదు. ఈ చిత్రమే శక్తి ఫిల్మ్‌కు మైలురాయిగా నిలుస్తుంది. కచ్చితంగా ఈ యేడాది ఉత్తమ చిత్రాల జాబితా అంటూ తయారు చేస్తే అందులో 'బైరి' ఉంటుంది' అని అన్నారు. అలాగే నిర్మాత దురైరాజ్, గేయరచయిత మోహన్ రాజ్, నటి మేఘ్న ఎలెన్, నటి శరణ్య చక్రవర్తి, నటి విజి శేఖర్ తదితరులు ప్రసంగించారు.

హీరోగా విష్ణు విశాల్ తమ్ముడు

హీరో విష్ణు విశాల్ సోదరుడు రుద్ర హీరోగా పరిచయమవుతున్నారు. 'ఓహో ఎందన్ బేబీ'లో ఆయన కథానాయకుడు. 'రోమ్ కామ్' జోనర్‌లో రూపొందిస్తున్నారు. ప్రముఖ క్యారెక్టర్ ఆర్టిస్ట్ కృష్ణకుమార్, రామ్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. బాలీవుడ్ యంగ్ నటి మిథిలా పాల్కర్ హీరోయిన్. ఈమెకు ఇదే తొలి తమిళ చిత్రం. 'ఎన్నై నోక్కి పాయుం తోట్టా', 'ముదలం నీ.. ముడివుం నీ' వంటి చిత్రాలకు బాణీలు సమకూర్చిన దర్బుక శివ సంగీతం అందించనున్నారు. కెమెరా డేనీ రేమాండ్. ఈ చిత్రాన్ని విష్ణు విశాల్ స్టూడియో, రోమియో పిక్చర్స్, డి కంపెనీలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. తొలి షెడ్యూల్‌ను మరో రెండు వారాల్లో ప్రారంభించనున్నారు. చిత్ర షూటింగ్ సంప్రదాయ పూజా కార్యక్రమంతో సోమవారం ప్రారంభమైంది. చెన్నై, కోయంబత్తూరు, పుదుచ్చేరి తదితర ప్రాంతాల్లో చిత్రీకరణ జరుపుకోనుంది.



రుద్ర, విష్ణు విశాల్, మిథిలా పాల్కర్

త్వరలో అత్తికడవు - అవినాశి ప్రాజెక్టు ప్రారంభం

● మంత్రి దురైమురుగన్

అత్తికడవు - అవినాశి ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వంలో 90 శాతం పూర్తి చేశామని, మిగిలిన పనులను కూడా పూర్తి చేసి, ఈ ప్రాజెక్టును ఎప్పుడు ప్రారంభిస్తారని అన్నాడీఎంకే సీనియర్ సభ్యుడు సెంగోట్టయ్యన్ ప్రశ్నించారు. దీనికి నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ సమాధానమిస్తూ... ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులు చాలా మేరకు పూర్తయ్యాయని, అయితే, కొన్ని ప్రాంతాల్లో పైపుల అనుసంధాన పనులు మిగిలివున్నాయన్నారు. వీటిని కూడా పూర్తి చేసి త్వరలోనే ప్రారంభిస్తామని మంత్రి సభకు తెలిపారు. అదేవిధంగా సేలం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల ప్రజలకు ఉపయోగపడేలా 100 చెరువులకు నీటిని నింపే పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. అయితే, ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయని, ఈ పనులను వేగవంతం చేసి, చెరువులకు వేగంగా నీటిని నింపాలని విపక్ష నేత ఎడప్పాడి కె.పళనిస్వామి కోరారు. దీనికి మంత్రి దురైమురుగన్ సమాధానమిస్తూ, వేగంగా పనులు పూర్తి చేసి, వేగంగా నీటిని నింపుతామంటూ ఒక్క ముక్కలో సమాధానం చెప్పారు.

సంసారం లేకుండా జీవించలేం

● మంత్రి తంగం తెన్నరసు ఛలోక్తి

సభాపర్వం



అడయార్, ఫిబ్రవరి 13: ప్రస్తుతం జరుగుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి తంగం తెన్నరసు మాట్లాడుతూ... సంసారం లేకుండా జీవితం కొనసాగించలేమన్నారు. ఈ మాటలకు సభలోని సభ్యులంతా కడుపుబ్బ నవ్వారు. ఈ ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుడు జీకే మణి మాట్లాడుతూ... సంసారం లేకుండా జీవించవచ్చు.. కానీ విద్యుత్ లేకుండా జీవించలేం అని అన్నారు. దీనికి మంత్రి తెన్నరసు సమాధానమిస్తూ, ఒక వ్యక్తి సంసారం లేకుండా జీవించవచ్చని చెప్పడాన్ని తాను అంగీకరించలేనన్నారు. దీంతో సభలో నవ్వులు విరిశాయి.

అది కేలంబాక్కం కాదు.. కీలంబాక్కం

మంత్రి శివశంకర్

నగర శివారు ప్రాంతమైన కీలంబాక్కంలో ఇటీవల ప్రభుత్వం ప్రారంభించిన కొత్త బస్టాండుపై సభలో ఆసక్తికర చర్చ సాగింది. ఈ బస్టాండు ప్రారంభించిన తర్వాత ప్రయాణికుల కష్టాలు మరింతగా పెరిగాయని అన్నాడీఎంకే సభ్యుడు, మాజీ మంత్రి సెల్లూరు రాజు సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి రవాణా శాఖామంత్రి పి.శివశంకర్ సమాధానమిస్తూ.. అది కేలంబాక్కం కాదని.. కీలంబాక్కం అని మాజీ మంత్రి తెలుసుకోవాలన్నారు. ఈ విషయంలో ప్రజలకు క్లారిటీ ఉందని మాజీ మంత్రికే స్పష్టత లేదన్నారు. పైగా కీలాంబాక్కంలో కొత్త బస్టాండును నిర్మించేందుకు స్థలాన్ని ఎంపిక చేసింది గత అన్నాడీఎంకే ప్రభుత్వమేననే విషయాన్ని సభ్యుడు గ్రహించాలన్నారు. ఈ బస్టాండు నిర్మాణ పనుల్లో 30 శాతం పనులను గత ప్రభుత్వం పూర్తి చేయగా, మిగిలిన పనులను తమ ప్రభుత్వం పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. పైగా ఈ బస్టాండు నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావడం లేదన్నారు ఇక్కడ నుంచి దక్షిణాది జిల్లాలకు 80 శాతం బస్సులు, మాధవరం బస్టాండు నుంచి 20 శాతం బస్సులను నడుపుతున్నామన్నారు. పైగా కీలంబాక్కం బస్టాండు పూర్తిస్థాయిలో పనిచేస్తుందని, కావాలంటే మాజీ మంత్రి సెల్లూరు రాజును అక్కడకు తీసుకెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

మరిన్ని జలాలు పొందేలా చర్యలు

కేఎన్ నెహ్రూ

సిరువాణి రిజర్వాయర్‌కే కేరళ ప్రభుత్వం నుంచి మరిన్ని జలాలు పొందేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకోసం కేరళ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని పురపాలక శాఖామంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు. ప్రస్తుతం ఈ జలాశయానికి కేరళ నుంచి తక్కువగానే నీరు వచ్చి చేరుతోందన్నారు. ఈ జలాలను మరింతగా పెంచాలని కేరళ ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. అలాగే వెల్లలూరు బస్టాండు నిర్మాణ పనుల కోసం లింకు రోడ్లను విస్తరించాల్సి ఉందని, ఈ పనులన్నీ పూర్తి చేసిన తర్వాత ఈ బస్టాండును ప్రజా వినియోగంలోకి తెస్తామని సమాధానమిచ్చారు.

23 ఏళ్లకే సివిల్ జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణత

● శ్రీపతిని అభినందించిన సీఎం స్టాలిన్



శ్రీపతి

పెరంబూర్, ఫిబ్రవరి 13: తిరువణ్ణామలై జిల్లా జవ్వాదుమలై సమీపం పులియూర్ గ్రామానికి చెందిన శ్రీపతి (23) సివిల్ జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణురాలైంది. 'వసతులు లేని కొండ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ చిన్న వయసులోనే ఈ ఘనత సాధించడం చూసి సంతోషిస్తున్నా. సామాజిక న్యాయం అనే పదం కూడా ఉచ్ఛరించ కుండా తమిళనాడుకు వచ్చే వారికి శ్రీపతి లాంటి విజయమే సమాధానం' అంటూ ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తన అభినందన సందేశంలో తెలిపారు. అలాగే, తమ ద్రావిడ మోడల్ పాలనలో ప్రభుత్వ పాఠశాలల్లో మాతృభాష తమిళంలో చదువుకున్న వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే ప్రభుత్వ జీవో ప్రకారం శ్రీపతి జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడం గర్వంగా ఉందన్నారు. ఆమె విజయానికి అండగా ఉన్న తల్లి, భర్తకు అభినందనలు తెలుపుతున్నానటూ సీఎం పేర్కొన్నారు.

ఎడప్పాడి వర్సెస్ శేఖర్‌బాబు



అసెంబ్లీకి వస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

అడయార్, ఫిబ్రవరి 13: కీలంబాక్కం బస్టాండులో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని ప్రభుత్వం దాచిపెడుతోందని మాజీ సీఎం ఈపీఎస్ ఆరోపించారు. ఈ బస్టాండులో చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని మంత్రి శేఖర్‌బాబు స్వయంగా సభలో చెప్పారని, అందువల్ల వాటిని పరిష్కరించి ప్రజలు రాకపోకలు సాగించేందుకు అనువుగా తీర్చి దిద్దాలని కోరారు. దీనికి మంత్రి పీకే శేఖర్‌బాబు దీటుగా సమాధానమిచ్చారు. ఈ బస్టాండులో రూ.100 కోట్లతో వివిధ రకాలైన మౌలిక సదుపాయాలను తమ ప్రభుత్వం కల్పించిందన్నారు అందువల్ల ఈ బస్టాండులో సౌకర్యాలు లేవనే మాటకే తావులేదన్నారు. అయితే, రాత్రి వేళల్లో ఎక్కువ బస్సులు అందుబాటులో లేవన్న ఫిర్యాదులు వస్తున్న మాట నిజమేనని, ఇందుకోసం మరిన్ని సర్వీసులను నడుపుతామన్నారు. మరో ఆరు నెలల్లో కీలంబాక్కం రైల్వే స్టేషన్ కూడా అందుబాటులోకి వస్తుందని మంత్రి శేఖర్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదాలు అడ్డుకొనేలా చర్యలు

● మంత్రి శివశంకర్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు ధృవీకరణ పత్రం అందజేస్తున్న మంత్రి శివశంకర్

ప్యారీస్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు అడ్డుకొనేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున అవసరమైన చర్యలు చేపట్టినట్లు రవాణా శాఖ మంత్రి శివశంకర్ పేర్కొన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసం సందర్భంగా చేపాక్కం నుంచి మెరీనా బీచ్ సమీపంలోని ఐల్యాండ్ గ్రౌండ్స్ వరకు మంగళవారం ఉదయం ఏర్పాటుచేసిన అవగాహన ర్యాలీని మంత్రి శివశంకర్ ప్రారంభించారు. ఇందులో ఆ శాఖ కమిషనర్ షణ్ముగసుందరం సహా పోలీసు అధికారులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... దేశంలో జరగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తమిళనాడు ప్రథమస్థానంలో ఉండడం దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదాలు అడ్డుకోవాల్సిన అవసరం ఉందని, ఆ ఉద్దేశంతోనే ప్రభుత్వం తరఫున ఇలాంటి అవగాహన ర్యాలీలు అన్ని జిల్లాల్లో చేపడుతున్నట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల్లో 19 నుంచి 32 ఏళ్లలోపున్న వారే అధికంగా నష్టపోతున్నారని, వాహనాలు నడుపుతున్న సమయంలో డ్రైవర్లు నిర్లక్ష్యం చూపడమే ప్రమాదాలకు ముఖ్యకారణమన్నారు. ఎంటీసీ ఏజీఎం గుణశేఖరన్ మాట్లాడుతూ... నగరంలో నడుపుతున్న సిటీ బస్సుల్లో ఫుట్‌బోర్డులపై నిలబడి ప్రయాణిస్తున్న వారిలో విద్యార్థులు అధికంగా ఉన్నారని, దీనిపై తల్లిదండ్రులు, సంబంధిత పాఠశాలలను హెచ్చరిస్తున్నామని ఆయన తెలిపారు.

బిందెలో చిక్కుకున్న కుక్క తల

● రక్షించిన అగ్నిమాపక సిబ్బంది



శునకం తలను వెలికి తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పెరంబూర్, ఫిబ్రవరి 13: కన్నియాకుమారి జిల్లా తెన్‌తామరైకుళం సమీపం పూవియూర్‌కు చెందిన బాలకృష్ణన్ ఓ కుక్కను సంరక్షిస్తున్నాడు. ఆ శునకం నీరు తాగేందుకు ఇంటి బయట చిన్న బిందె పెడుతుంటారు. మంగళవారం ఉదయం యథావిధిగా నీరు తాగేందుకు యత్నించిన శునకం తల బిందెలో చిక్కుకుంది. దీనిని గమనించిన బాలకృష్ణన్, బిందె నుంచి తలకు తీసేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో కన్నియాకుమారి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకొని బిందె పై భాగాన్ని కత్తిరించి శునకం తలను సురక్షితంగా వెలికితీశారు.

నేటినుంచి వడివుడైయమ్మన్ ఆలయ వేడుకలు

అడయార్, ఫిబ్రవరి 13: స్థానిక తిరువొత్రియూరులోని వడి వుడైయమ్మన్ సమేత త్యాగరాజస్వామి ఆలయంలో మాసి మాసోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఈనెల 21న జరగనుంది. కాగా, ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి 7 గంటలకు గణపతి పూజోత్సవం జరుగుతుంది. 15వ తేదీ రాత్రి 8 గంటలకు మాసి ఉత్సవం నిర్వహిస్తారు. 16వ తేదీ ఉదయం సూర్యప్రభ వాహనంపై చంద్రశేఖర స్వామి ఊరేగింపు, రాత్రి 7.30 గంటలకు చంద్రప్రభ వేడుక, రాత్రి త్యాగరాజస్వామి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు.



మంగళవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర గవర్నర్ రవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న మదురై చాప్టర్‌కు చెందిన సీఐఐ యువ ప్రతినిధులు

మంత్రి పెరియస్వామి విడుదలపై అప్పీలు ఎందుకు చేయలేదు

● ఏసీబీకి హైకోర్టు ప్రశ్న

పెరంబూర్, ఫిబ్రవరి 13: గృహవసతి బోర్డు గృహాల కేటాయింపులో అవినీతి కేసులో మంత్రి ఐ.పెరియస్వామి విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ అప్పీలు ఎందుకు చేయలేదని అవినీతి నిరోధక శాఖను మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. 2008వ సంవత్సరంలో తమిళనాడు గృహ వసతి బోర్డుకు చెందిన ఇళ్లను దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి భద్రతా అధికారిగా ఉన్న గణేశన్‌కు కేటాయించడంలో అవినీతి జరిగిందని నమోదైన కేసులో మంత్రి ఐ.పెరియస్వామి విడుదలయ్యారు. దీనిని మద్రాసు హైకోర్టు సుమోటా కేసుగా స్వీకరించి విచారణ చేపట్టింది. ఈ కేసు మంగళవారం న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ విచారించారు. ఆ సమయంలో అవినీతి నిరోధక శాఖ తరపున హాజరైన ప్రభుత్వ ప్రధాన న్యాయవాది పీఎస్ రామన్ వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగి అయినందున ఈ కేసు విచారణకు గవర్నర్ అనుమతి పొందాల్సి ఉందన్నారు. మంత్రుల నియామకం, తొలగింపునకు గవర్నర్‌కు అధికారం ఉందన్నారు. అందువల్ల కేసు నమోదుకు వారి అనుమతి పొందాలని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిందని పేర్కొన్నారు. ఈ కేసు నుంచి విడిపించాలనే పిటిషన్‌కు, 2023 జనవరిలో అవినీతి నిరోధక శాఖ, విడుదల చేయాలనే అభ్యర్థన విచారణకు తగినది కాదని, కేసులో సాక్షుల విచారణ ప్రారంభైన మధ్యంతర కాలంలో విడుదల చేయాలని కోరలేమని తెలియజేసిందన్నారు. అభియోగాల నమోదు చేసిన తర్వాత ట్రయల్ కోర్టు నిందితులను నిర్దోషులుగా ప్రకటించలేమని ఆయన వాదించారు. అనంత రం న్యాయమూర్తి స్పందిస్తూ.. ఎందుకు సరైన అనుమతి గవర్నర్ నుంచి పొందలేదు అని అవినీతి నిరోధక శాఖను ప్రశ్నించారు. ఇంకా సమయం మించి పోలేదని, ఇప్పటికైనా గవర్నర్ అనుమతి పొందవచ్చన్నారు. విడుదలను వ్యతిరేకిస్తూ ఎందుకు అప్పీలు చేయలేదు? అవినీతి నిరోధక శాఖ అలసత్వ కారణంగానే ఈ కేసు సుమోటాగా స్వీకరించామని తెలిపారు. మంత్రులుగా ఉన్న వారు ప్రజల మధ్యలో నిజాయితీపరులుగా ఉండాలన్నారు. అధికారంలో ఉన్న వారు అవినీతికి పాల్పడితే తగిన చర్యలు తీసుకుంటారనే నమ్మకం ప్రజల్లో కలగాలని అంటూ పేర్కొన్న న్యాయమూర్తి, తేది ప్రకటించకుండా తీర్పు వాయిదావేశారు.



మంత్రి పెరియస్వామి

విడతల వారీగా ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం

మంత్రి తంగం తెన్నరసు

పెరంబూర్, ఫిబ్రవరి 13:: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాలు విధుల బహిష్కరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలని మంత్రి తంగం తెన్నరసు విజ్ఞప్తి చేశారు. తమ దీర్ఘకాల సమస్యల సాధనకు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఘాల సమాఖ్య (జాక్టో-జియో) ఈనెల 26వ తేది నుంచి సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో, ఈ సంఘాల నేతలతో మంగళవారం మంత్రి తంగం తెన్నరసు సమావేశమయ్యారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవ్యంగా లేదని, ప్రతి ప్రభుత్వ ఉద్యోగి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం అభిప్రాయమన్నారు. ఆర్థిక పరిస్థితి మెరుపడేలా పలు చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన రూ.20,000 కోట్ల బకాయిలు కేంద్రప్రభుత్వం నుంచి రావాల్సి ఉందన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలు విడతల వారీగా పరిష్కరించేలా చర్యలు చేపడతున్నామని, ఈ సంఘాలు సమ్మె పిలుపును ఉపసంహరించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.



చెన్నై సచివాయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జాతీయస్థాయి పోటీల్లో పతకం సాధించిన క్రీడాకారిణి ఆర్.తమిళరసికి 'కార్బన్ ట్రాక్ బైక్'ను బహుమతిగా అందజేస్తున్న యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖల మంత్రి ఉదయనిధి

పీచు మిఠాయి కేంద్రాల్లో అధికారుల తనిఖీ



మిఠాయి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆహార భద్రతా శాఖ అధికారి

పెరంబూర్, ఫిబ్రవరి 13: సేలం జిల్లాలో పీచు మిఠాయి తయారీ కేంద్రాల్లో ఆహార భద్రతా శాఖ అధికారులు తనిఖీలు చేపడుతున్నారు. రోడ్ల పక్కన, రద్దీ ప్రదేశాల్లో తోపుడు బండ్లు, సైకిళ్ల ద్వారా విక్రయిస్తున్న పీచు మిఠాయిలో రసాయనాలు కలుపుతున్నట్లు, ఇలాంటి పదార్థాలు తీసుకోవడం ద్వారా క్యాన్సర్ సహా పలు వ్యాధులు సంక్రయించే అవకాశముందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి విక్రయాలపై తగిన చర్యలు చేపడతామని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం హెచ్చరించారు. ఈ నేపథ్యంలో, సేలం - బెంగళూరు బైపాస్ రోడ్డు ప్రాంతంలోని 8 పీచు మిఠాయి తయారీ దుకాణాల్లో ఆహార భద్రత శాఖ అధికారి కదివరన్ నేతృత్వంలో అధికారలు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో సేకరించిన పీచు మిఠాయి నమూనాలను పరిశోధనలకు ల్యాబ్‌లకు పంపినట్లు, రసాయనాలు కలిపారని నివేదిక అందితే సంబంధిత దుకాణాలపై చర్యలు చేపడతామని కదిరవన్ తెలిపారు. కాగా పుదుచ్చేరిలో పీచు మిఠాయిలను గవర్నర్ తమిళిసై నిషేధించిన విషయం విదితమే.